సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 25 । ఏప్రిల్ । 2025



ప్రకృతి ప్రసాదం

వేసవిలో అందరికీ గుర్తుకు వచ్చేవి తాటి ముంజులు. శరీరానికి కావాల్సిన విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. 10లో▸



అపారమైన అవకాశాలు

దేశంలో వైద్యరంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. 10లో▸



మహేశ్వరం డిపోకు అవార్డు

ఆర్టీసీ డిపోలో బస్సులకు అత్యధిక కేపీఎల్ వచ్చినందుకు మహేశ్వరం డిపోకు హైలెవల్ మైలేజ్ అవార్డు దక్కింది. 10లో▸

న్యూస్‌రీల్

వక్ఫ్ బోర్డు ఒక మతానికి సంబంధించింది కాదు



మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: వక్ఫ్ బోర్డు ఒక మతానికి సంబంధించింది కాదని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. హిమాయత్‌నగర్ చౌరస్తాలోని బీజేపీ కార్యాలయంలో గురువారం వక్ఫ్ చట్ట సవరణ సదస్సు 2025 పేరుతో వక్ఫ్ చట్టసవరణ జిల్లా కన్వీనర్ అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ అధ్యక్షతన వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వక్ఫ్ అనేది 90 శాతం అన్ని మతాలకు సంబంధించిందని స్పష్టం చేశారు. 2024 వక్ఫ్ బిల్లు పాసైందన్నారు. దాదాపు పది లక్షల ఎకరాల ఆర్థిక సంపద ఉన్నా 2024లో కేవలం రూ.168 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చిందన్నారు. వక్ఫ్ బోర్డుపై ప్రజల్లో చైతన్యం కల్పించాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాష్, అంజన్‌కుమార్‌గౌడ్, మండల అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



జిల్లా రెవెన్యూ అధికారి సంగీతకు వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

ఇబ్రహీంపట్నం రూరల్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, కార్యదర్శి కవిత డిమాండ్ చేశారు. మే నెలంతా ఒకేసారి సెలవులపై వెంటనే నిర్ణయం చేయాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ములుగు జిల్లాలో పోషణ పక్వాడ కార్యక్రమం సందర్భంగా మేనెలంతా సెలవులు ఇచ్చేలా పరిశీలిస్తున్నామని చెప్పి నేటికీ అమలు చేయడం లేదన్నారు. 40 డిగ్రీల ఎండలు మండుతున్నప్పటికీ సెలవులు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. అనంతరం డీఆర్‌ఓ సంగీతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగమణి, బాలమణి, జయమ్మ, జ్యోతి, సుధ, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

నేడు భూ భారతిపై అవగాహన సదస్సు

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీలక్ష్మి గార్డెన్స్‌లో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ లలిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పలువురు అధికారులు హాజరు కానున్నట్టు తెలిపారు.

పారే నీటిని ఒడిసిపట్టాలి



మాట్లాడుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత

మంచాల: గ్రామీణ ప్రాంతాల్లో పారే వర్షపు నీటిని ఒడిసి పట్టుకొని, భూగర్భ జలాలను పెంపొందించుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత అన్నారు. మండలంలోని చిత్తాపూర్, తిప్పాయిగూడ గ్రామాల్లో గురువారం వాటర్‌షెడ్ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. భూ గర్భజలాలను పెంచడమే వాటర్ షెడ్ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. అవసరమైన చోట చెక్‌డ్యాం నిర్మాణాలు, చెక్ వాల్స్, గల్లీ కంట్రోల్ పనులు, పారే నీటిని భూమిలోకి ఇంకించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వాటర్‌షెడ్ కమిటీల ద్వారా పనులు ప్రణాళికా బద్ధంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రంగారావు, మండల ప్రత్యేకాధికారి సుజాత, ఎంపీడీఓ బాలశంకర్, ఎంపీఓ ఉమారాణి, ఏపీఓ వీరాంజనేయులు, వాటర్‌షెడ్ పీఓ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: జాతీయ జెండాలతో విద్యార్థుల ర్యాలీ




షాద్‌నగర్: ర్యాలీలో పాల్గొన్న నాయకులు

నిరసన.. నివాళి

పహల్గాం ఉగ్రదాడిపై సర్వత్రా నిరసనలు మిన్నంటాయి. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో గురువారం శాంతి ర్యాలీలు నిర్వహించారు. ఉగ్రవాదులకు సంబంధించిన దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినదించారు. పిరికిపందల చర్యగా అభివర్ణించారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి నివాళి అర్పించారు.

సూరీడు @40



భానుడి భగభగలు

- గ్రేటర్‌లో 40 డిగ్రీలకు చేరిన పగటి ఉష్ణోగ్రతలు
- భారీగా పెరుగుతున్న గృహ, వాణిజ్య విద్యుత్ వినియోగం
- గురువారం ఏకంగా 4,170 మెగావాట్లకు చేరిన డిమాండ్
- వడదెబ్బబారిన యాచకులు, చిన్నారులు, వృద్ధులు

గ్రేటర్‌లో విద్యుత్ వినియోగం (మెగావాట్లలో..)

తేదీ	2024	2025
ఏప్రిల్ 21	3,441	3,856
ఏప్రిల్ 22	3,886	4,026
ఏప్రిల్ 23	3,745	4,136
ఏప్రిల్ 24	3,795	4,170

సాక్షి, రంగారెడ్డిజిల్లా: భానుడు భగ్గున మండిపోతున్నాడు. ఉదయం 10 గంటలకే సుర్రుమంటున్నాడు. రోడ్లన్నీ బోసిపోయి కన్పిస్తున్నాయి. గురువారం పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరాయి. 2024 మే 6న రికార్డు స్థాయిలో 4,352 మెగావాట్ల డిమాండ్ (90.68 మిలియన్ యూనిట్లు) నమోదు కాగా, తాజాగా గురువారం 4,170 మెగావాట్లకు చేరింది. ఇది ఇలాగే కొనసాగితే మే 1 నాటికి 4,500 మెగావాట్లకుపైగా చేరుకునే అవకాశం లేకపోలేదని ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

వడగాల్పులకు ఉక్కపోత తోడవడంతో వాహనదారులు, మార్కెటింగ్ ఏజెంట్లు, రోడ్ సైడ్ వ్యాపారులు, ప్రధాన కూడళ్లలో నిలబడి యాచించే యాచకులు, వివిధ పనుల నిమిత్తం బయటికి వచ్చిన పాదచారులు, వీధుల్లో ఆడుకునే చిన్నారులు వడదెబ్బ బారిన పడుతున్నారు. సరిపడా తాగునీరు తీసుకోకపోవడంతో ఇంట్లో ఉన్న వృద్ధులు సైతం అస్వస్థతకు గురవుతున్నారు. పశువులు, పక్షులు సహా ఇతర మూగజీవాలు ఎండకు తట్టుకోలేక పోతున్నాయి. మరోవైపు చాపకింది నీరులా బస్తీల్లో చికెన్ ఫాక్స్ విస్తరిస్తోంది. ఇప్పటికే అనేక మంది చిన్నారులు ఈ వైరస్ బారినపడి.. తీవ్రమైన జ్వరం, ఒంటినిండా పొక్కులతో బాధపడుతున్నారు. చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు.

రోజంతా ఆన్‌లోనే ఏసీలు

ఒకప్పుడు ధనవంతుల ఇళ్లలోనే కన్పించే ఏసీలు ప్రస్తుతం సామాన్య, మధ్య తరగతి నివాసాల్లోనూ దర్శనమిస్తున్నాయి. ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం అనేక మంది ఏసీలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. తయారీ కంపెనీలతో పాటు వివిధ ప్రైవేటు బ్యాంకులు జీరో పర్సంటేజీ లోన్లు మంజూరు చేస్తుండటంతో ఆర్థికంగా ఉన్న వారే కాదు సామాన్య, మధ్య తరగతి ప్రజలు కూడా వీటిని కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రతి ఇంట్లోనూ ఫ్యాన్లు, కూలర్లు, కంప్యూటర్, టీవీ, ఐరన్‌బాక్స్, మిక్సీ సహా ఓవెన్, వాషింగ్ మిషన్, రిఫ్రిజిరేటర్, ఏసీ సర్వసాధారణమయ్యాయి. ఇంట్లో, ఆఫీసు, వాణిజ్య కేంద్రంలో ఏసీ లేకుండా ఉండలేని పరిస్థితి. ఫలితంగా కొద్ది రోజుల నుంచి విద్యుత్ వినియోగం రికార్డు స్థాయిలో నమోదవుతోంది.

పండ్లు, రసాలకు డిమాండ్

పలు స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులు వ్యాపార సముదాయాలు, ఆస్పత్రులు, మార్కెట్లు, ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి తాగునీరు, మజ్జిగ పంపిణీ చేస్తున్నప్పటికీ ఎండలకు దప్పిక తీరని పరిస్థితి నెలకొంది. ఉపశమనం కోసం చెరుకు రసాలు, పండ్ల రసాలు, ఇతర శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్లో పండ్ల ధరలకు రెక్కలొచ్చాయి. మామిడి కిలో రూ.80 నుంచి రూ.120 పలుకుతుండగా, కర్బూజా రూ.25 నుంచి రూ.30వరకు, పుచ్చకాయ రూ.20 వరకు పలుకుతోంది. ఇక నిమ్మ సైజును బట్టి ఒక్కో కాయ రూ.5పైనే అమ్ముతున్నారు. మార్కెట్లో పండ్లు, ఇతర ముడి సరుకుల ధరలు అమాంతం పెరగడంతో జ్యూస్ ధరలు కూడా భారీగా పెంచేశారు. గతంలో గ్లాసు చెరుకు రసం రూ.20 ఉండగా ప్రస్తుతం రూ.35 విక్రయిస్తున్నారు. నిన్న మొన్నటి వరకు రూ.30కే విక్రయించిన కొబ్బరి బొండాను ప్రస్తుతం ఏకంగా రూ. 50కి పెంచేశారు.



మొయినాబాద్: సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

‘భూ భారతి’తో భూ హక్కుల పరిరక్షణ

- కలెక్టర్ నారాయణరెడ్డి

మొయినాబాద్: భూ భారతి చట్టంతో భూమి హక్కులు పరిరక్షించబడతాయని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మొయినాబాద్‌లోని సురంగల్ రోడ్డులో ఉన్న ఓ కన్వెన్షన్ హాల్‌లో గురువారం తహసీల్దార్ గౌతమ్‌కుమార్ అధ్యక్షతన భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలన్నీ సత్వరం పరిష్కరించబడుతాయన్నారు. వ్యవసాయ, వాణిజ్య భూములను పక్కాగా పరిరక్షించే అవకాశం భూ భారతి చట్టం కల్పిస్తుందన్నారు. దీనిపై మే 1 నుంచి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తామని చెప్పారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. భూ సమస్యలు పరిష్కరించి రైతుల ఇబ్బందులు తీర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి భూ భారతి చట్టం తీసుకురావడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ గౌతమ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ జంగయ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్, ఎంపీఓ వెంకటేశ్వరరెడ్డి, ఏఓ అనురాధ, ఏపీఎం రవీందర్, టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు పరిష్కారం

షాబాద్: భూభారతి చట్టంతో రైతుల భూ సమస్యలకు పరిష్కారం లభించడంతో పాటు హక్కులు భద్రంగా ఉంటాయని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో గురువారం భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చట్టం విధి విధానాలను రైతులకు వివరించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ధరణిని రద్దు చేసి కొత్త చట్టం తెచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ అన్వర్, డిప్యూటీ తహసీల్దార్ మధు, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, టీపీసీసీ కార్యదర్శి ఎస్.రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రంగస్వామి, (ఇన్‌సెట్) యాదయ్య (ఫైల్)

అక్రమ సంబంధానికి అడ్డొస్తాడని..

- కత్తితో గొంతుకోసి.. పెట్రోల్ పోసి తగులబెట్టి
- ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- నిందితుల అరెస్టు..రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్: అక్రమ సంబంధానికి అడ్డు పడుతున్నాడని భర్తను అంతమొందించాలనుకుంది.. ప్రియుడితో కలిసి పథకం వేసింది.. పథకం ప్రకారం మద్యం మత్తులో ఉన్న భర్తను ప్రియుడితో కలిసి కత్తితో గొంతుకోసి హత్య చేసింది.. మృతదేహాన్ని గుంతలో పడేసి పెట్రోల్‌తో తగలబెట్టింది.. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఏసీపీ రంగస్వామి వివరాలు వెల్లడించారు. ఫరూఖ్‌నగర్ మండలం చిన్నచిల్కమర్రి గ్రామానికి చెందిన ఎరుకలి యాదయ్య(32)కు ఎనిమిదేళ్ల క్రితం కొందుర్గు మండలం మహదేవ్‌పూర్‌కు చెందిన మౌనికతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. యాదయ్య కూలి పనులు చేస్తుండగా మౌనిక గ్రామ సమీపంలోని ఓ పరిశ్రమలో పని చేస్తోంది. ఈ పరిశ్రమకు మండల పరిధిలోని కంది వనం గ్రామానికి చెందిన ఎరుకలి అశోక్ తన ఆటోలో కూరగాయలు, వంట సామగ్రి తీసుకొచ్చేవాడు. ఈ క్రమంలో మౌనికకు అతడితో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. అశోక్‌ను తమకు దూరపు బంధువని భర్తకు పరిచయం చేసింది. భర్తను అడ్డు తొలగిస్తే సుఖంగా ఉండొచ్చని భావించి హత్య చేయాలనుకుంది.

మద్యం మత్తులో ఉండగా..

శంషాబాద్ మండలం రామాంజపూర్‌లోని తన బాబాయ్ ఇంట్లో విందుకు వెళదామని 18 ఫిబ్రవరి 2025న అశోక్ తన ఆటోలో యాదయ్య, మౌనికను తీసుకొని రామాంజపూర్‌కు బయలుదేరారు. నందిగామ మండలం గూడూరు గ్రామ పరిధిలోని పెద్ద గుట్టతండా సమీపంలో ఆటోను నిలిపి ముగ్గురూ నిర్మానుష్య ప్రదేశానికి వెళ్లి మద్యం తాగారు. మద్యం మత్తులో ఉన్న భర్తను పథకం ప్రకారం అశోక్‌తో కలిసి కత్తితో గొంతుకోసి హత్య చేసింది. మృతదేహాన్ని గుంతలో పడేసి పెట్రోల్‌పోసి తగలబెట్టింది. అనంతరం మౌనికను అశోక్ తన ఆటోలో చిన్నచిల్కమర్రి సమీపంలో వదిలి వెళ్లిపోయాడు.

కనిపించడం లేదని ఫిర్యాదు చేసి

ఎప్పటిలాగే ఉదయం పాలు పితకడానికి వెళ్లిన తన భర్త యాదయ్య కనిపించడం లేదని 24 ఫిబ్రవరి 2025న మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. సెల్‌ఫోన్ ఇంట్లోనే పెట్టి వెళ్లాడని, నాలుగు రోజులుగా ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొంది. అదృశ్యం కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కొన్ని రోజుల తరువాత మౌనిక, అశోక్ భార్యాభర్తలమని చెప్పి పట్టణంలోని అయ్యప్పకాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని సహజీవనం చేస్తున్నారు. విషయం మృతుడి బంధువులకు తెలియడంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా నేరం అంగీకరించా రు. నిందితులతో ఘటనా స్థలానికి వెళ్లి యాదయ్య ఎముకలు, పుర్రెను సేకరించారు. నిందితుల నుంచి ఆటో, వేటకొడవలి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

పోలీసులను అభినందించిన ఏసీపీ

శంషాబాద్ అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్, ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో పట్టణ సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కేసును ఛేదించారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ సుశీల, హెడ్‌కానిస్టేబుల్ విజయభాస్కర్, సిబ్బంది నరేందర్, రాజేష్, కరుణాకర్‌ను ఏసీపీ రంగస్వామి అభినందించారు.

స్క్రాప్ ఉందని రప్పించి..

- రూ.25 లక్షలు కాజేసి..
- పథకం ప్రకారం దోపిడీ
- ఏఆర్ కానిస్టేబుల్, మరో ఇద్దరి అరెస్టు
- పరారీలో ప్రధాన నిందితులు

మొయినాబాద్: స్క్రాప్ బిజినెస్ చేసేవారి నుంచి హవాలా డబ్బును కొట్టేయాలని పథకం పన్నారు. పథకం ప్రకారం స్క్రాప్ ఉందని వ్యాపారులను రప్పించారు. డబ్బులు తెచ్చిన వారిని పథకంలో భాగంగా ఏఆర్ కానిస్టేబుల్ బెదిరించాడు. ఏడుగురు చుట్టుముట్టి డబ్బులు లాక్కుని పారిపోయారు. సినీ ఫక్కీలో జరిగిన ఈ సంఘటన సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో కలకలం రేపింది. మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అజయ్ స్క్రాప్ బిజినెస్ చేస్తాడు. ఇతనికి నబి అనే వ్యక్తి ముంబయ్‌లో కొంత కాలం క్రితం పరిచయమయ్యాడు. ఈ క్రమంలో అతని కొడుకు మొబిన్ పరిచయమయ్యాడు. అజయ్, మొబిన్ బుధవారం హైదరాబాద్‌లో స్క్రాప్ బిజినెస్ చేసే ఇమ్రాన్, ఉమర్ అనే వ్యాపారులకు ఫోన్ చేశారు. మొయినాబాద్ మండలం కుత్బుద్దీన్‌గూడలో ఓ షెడ్డులో స్క్రాప్ ఉంది. అది తీసుకోవడానికి డబ్బులు తీసుకుని రావాలని చెప్పారు. వారి మాటలు నమ్మిన వ్యాపారులు రూ.25 లక్షలు నగదు తీసుకుని కుత్బుద్దీన్‌గూడకు వచ్చారు. అజయ్, మొబిన్ వారిని ఫాంహౌస్ లోపల స్క్రాప్ ఉందని లోపలికి పంపుతుండగానే ఐదుగురు వ్యక్తులు వచ్చి వారిని చుట్టు ముట్టారు. ఈ డబ్బులు ఎక్కడివి.. ఎక్కడికి తీసుకెళ్తున్నారంటూ వారిని బెదిరించి డబ్బులు లాక్కున్నారు. వెంటనే అజయ్, మొబిన్‌ను సైతం కారులో ఎక్కించుకుని అక్కడి నుంచి పారిపోయారు.

అంతా పథకం ప్రకారమే..

స్క్రాప్ వ్యాపారుల నుంచి హవాలా డబ్బులు కొట్టేయాలనే ఆలోచనతో అజయ్, మొబిన్ పథకం వేశారు. మొబిన్ ఆరు నెలల క్రితం వరకు హైదరాబాద్‌కు చెందిన జుబేర్ వద్ద డ్రైవర్‌గా పనిచేశాడు. జుబేర్‌కు మొయినాబాద్ మండలంలోని కుత్బుద్దీన్‌గూడలో ఫాంహౌస్ ఉంది. ఫాంహౌస్‌లో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్న కుత్బుద్దీన్‌గూడకు చెందిన రాంచందర్‌తో విషయం చెప్పాడు. డబ్బులు తీసుకుని వచ్చేవారిని బెదిరించేందుకు పోలీసులెవరైనా ఉంటే బాగుంటుందని చెప్పాడు. సైబరాబాద్ కమిషనరేట్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కుత్బుద్దీన్‌గూడకు చెందిన శేఖర్‌కు విషయం చెప్పాడు. అదే గ్రామానికి చెందిన మసూద్‌ను సైతం సిద్ధం చేశాడు. వీరితోపాటు మొబిన్ తండ్రి నబి, బంధువు ఇమ్రాన్‌ను కలుపుకొని పథకం వేశారు. స్క్రాప్ వ్యాపారులు రూ.కోట్లలో బిజినెస్ చేస్తారని.. వారి వద్ద అంతా హవాలా డబ్బు ఉంటుందని.. డబ్బులు లాక్కున్నా ఎక్కడా ఫిర్యాదు చేయరని అజయ్ చెప్పడంతో అందరూ కలిసి డబ్బులు కొట్టేసే పథకం పన్నారు. దాని ప్రకారమే బుధవారం మధ్యాహ్నం స్క్రాప్ వ్యాపారులు ఇమ్రాన్, ఉమర్‌కు ఫోన్ చేసి రప్పించారు. వారు తెచ్చిన రూ.25 లక్షల నగదును లాక్కుని కారులో పారిపోయారు.

పోలీసులకు ఫిర్యాదు చేయడంతో..

ఈ ఘటనపై బాధితులు మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి రంగంలోకి దిగారు. ఫాంహౌస్‌లో పనిచేసే రాంచందర్, ఏఆర్ కానిస్టేబుల్ శేఖర్, మరో నిందితుడు మసూద్ కుత్బుద్దీన్‌గూడకు చెందినవారు కావడంతో మొదట వారి వివరాలు సేకరించారు. శేఖర్ ఏఆర్ కానిస్టేబుల్‌గా సైబరాబాద్ కమిషనరేట్‌లో పనిచేస్తున్నాడని తెలుసుకుని పూర్తి వివరాలు రాబట్టారు. ఏమీ తెలియనట్టు ఊళ్లోనే ఉన్న శేఖర్, రాంచందర్, మసూద్‌ను బుధవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన సూత్రధారులు అజయ్, మొబిన్, అతని తండ్రి నబి, బంధువు ఇమ్రాన్ పరారీలో ఉన్నారు. ఈ మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

విద్యావ్యవస్థను గాలికొదిలేసిన ప్రభుత్వం

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్

షాద్‌నగర్: ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా గాలికొదిలేసిందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ విమర్శించారు. పట్టణంలోని ఠాగూర్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో గురువారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా 26వ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడుతూ. ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజుల రూపంలో కోట్ల రూపాయలు దండుకుంటున్నా అడిగే నాథుడే కరువయ్యాడని వాపోయారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కేంద్రం తీసుకువచ్చిన నూతన విద్యా విధానంతో విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు. అనంతరం సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రణయ్, ఉపాధ్యక్షులుగా చరణ్, శ్రీకాంత్, శివ, తరంగ్, కార్యదర్శిగా శంకర్, సహాయ కార్యదర్శిగా అరుణ్, శ్రీకాంత్, స్టాలిన్, సభ్యులుగా వంశీ, శ్రీనివాస్, కుమార్, తనీష్, ప్రణవ్, శివ, తరుణ్, రాము, చరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్



విద్యార్థులకు పట్టాలు అందిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి

వైద్య రంగంలో అపార అవకాశాలు

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

చేవెళ్ల: దేశంలో వైద్యరంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. చేవెళ్లలోని డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల మొదటి బ్యాచ్ (2019) విద్యార్థుల స్నాతకోత్సవం (గ్రాడ్యుయేషన్ డే) వేడుకలను గురువారం పద్మావతి కన్వెన్షన్‌లో కళాశాల చైర్మన్, మండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, కనిపించే దేవుడు వైద్యుడేనని ప్రజలు నమ్ముతారన్నారు. ప్రభుత్వం వైద్య రంగానికి ప్రాముఖ్యత ఇస్తుందన్నారు. మండలి చీఫ్‌విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. త్వరలోనే వైద్య కళాశాలను యూనివర్సిటీగా తీర్చిదిద్దేంకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శాంతా బయోటెక్ ఫార్మా వ్యవస్థాపకుడు, పద్మభూషణ్ డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎస్సార్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ వరదారెడ్డి, కళాశాల డైరెక్టర్లు సంతోష్ రెడ్డి, తిరుపతిరెడ్డి, కళాశాల డీన్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ జోయారాణి, సూపరింటిండెంట్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘరానా దొంగ అరెస్టు

- 44 కేసుల్లో నిందితుడు

జీడిమెట్ల: ఇంట్లో ఎవరూలేని సమయంలో కిటికీ గ్రిల్స్ తొలగించి ఇంట్లో ఉన్న బంగారు, వెండి నగలు దోచుకెళ్లే గజదొంగను జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేసి రూ.11.5లక్షల సొత్తు రికవరీ చేశారు. గురువారం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో జీడిమెట్ల ఇన్స్‌పెక్టర్ గడ్డం మల్లేష్, డీఐ కనకయ్య వివరాలను వెల్లడించారు. అపురూప కాలనీకి చెందిన పింటూ మార్చి 5న కుటుంబ సభ్యులతో కలిసి కలకత్తా వెళ్లాడు. మరుసటి రోజు వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించాడు. ఇది సీసీ కెమెరాలో రికార్డ్ అయి ఉంది. ఉదయం సీసీ కెమరాలను పరిశీలించిన పింటూ ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితుడు వేణుగోపాల్(26), సంపత్‌సాయి(20)గా గుర్తించారు. బుధవారం సాయంత్రం వేణుగోపాల్‌ను



వివరాలు వెల్లడిస్తున్న ఇన్స్‌పెక్టర్ మల్లేశ్

జీడిమెట్ల పోలీసులు అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి రూ.11.5లక్షలు విలువచేసే బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. కాగా మరో నిందితుడు సంపత్‌సాయి పరారీలో ఉన్నాడు. ఈమేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి వేణుగోపాల్‌ను రిమాండుకు తరలించారు. వేణుగోపాల్ సైబరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇప్పటికే 44కేసుల్లో నిందితుడుగా ఉండగా గతంలో దుండిగల్ పీఎస్ నుండి పీడీయాక్టు ద్వారా సంవత్సరం జైలుశిక్ష అనుభవించాడు.

నిలోఫర్ ఉద్యోగినిపై కేసు నమోదు

నాంపల్లి: నిలోఫర్ ఆసుపత్రిలో రోగులకు అక్రమంగా మందులను విక్రయిస్తూ పట్టుబడిన ఉద్యోగి దాయమ్మపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాలుగో తరగతి ఉద్యోగిగా పనిచేస్తున్న ఆమె.. రాత్రి వేళల్లో విధుల్లో ఉంటూనే ఆసుపత్రికి వచ్చే రోగులకు అనధికారికంగా మందులను విక్రయిస్తోంది. ఈ విషయం ఆస్పత్రి అధికారుల దృష్టికి వచ్చింది. బుధవారం రాత్రి నిలోఫర్ ఆసుపత్రికి మందులతో వచ్చిన ఆమెను సెక్యూరిటీ సిబ్బంది అడ్డగించి చేతిలో ఉన్న సంచులను తనిఖీ చేశారు. ఆమె దగ్గర విలువైన మందులతో పాటు, కరెన్సీ నోట్లు లభించాయని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదును స్వీకరించిన నాంపల్లి శాంతి భద్రతల విభాగం పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి ప్రసాదం.. ఆరోగ్యానికి వరం

నోరూరిస్తున్న తాటి ముంజలు

- వేసవిలో విరివిగా లభ్యం..
- ఉపాధి పొందుతున్న గ్రామీణులు
- పోషకాలు ఆస్వాదిస్తున్న పట్టణ ప్రజలు

హుడాకాంప్లెక్స్: వేసవి కాలంలో అందరికీ గుర్తుకు వచ్చేవి తాటి ముంజులు. వీటిని ఐస్ యాపిల్ తదితర పేర్లతో పిలుస్తుంటారు. ఈ సహజ ఫలంలో శరీరానికి కావాల్సిన విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. అధిక మొత్తంలో నీరు ఉండటం వలన శరీర బరువును తగ్గించడానికి ఇవి ఎంతాగానో తోడ్పడతాయి. శరీరాన్ని చల్లగా ఉంచుతాయి. అందుకే ముంజలను ప్రకృతి ప్రసాదంతో పోలుస్తుంటారు. వీటిని ఇష్టపడని వారు ఉండరూ. ప్రతి ఒక్కరూ ఆరగిస్తుంటారు. ఇవి ఎక్కువగా వేసవిలో లభిస్తుంటాయి. నగరంలో తాటి వనాలు లేనప్పటికీ.. గ్రామీణ వ్యాపారులు పల్లెల నుంచి పట్టణాలకు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. నగరంలోని రహదారులకు ఇరువైపులా తోపుడు బండ్లు, ఆటోలు ఇలా ఏదేనీ వాహనంలో తెచ్చి.. పట్టణ వాసులకు పోషకాలను అందజేస్తున్నారు.

పోషక భాండాగారం

తాటి ముంజలు శరీరంలోని చక్కెర, ఖనిజ లవణాలను సమతుల్యం చేస్తాయి. విటమిన్ బీ7, కే. సెలెబుల్ ఫైబర్, పొటాషియం, కాల్షియం, విటమిన్- ఏ,డీ, జింక్, ఐరన్ ఎక్కువగా లభిస్తాయి. వీటిలో నీటిశాతం ఎక్కువగా ఉండటం వలన వడదెబ్బ నుంచి ఉపశమనం లభిస్తుంది. డీ హైడ్రేషన్ బారిన పడకుండా చేస్తాయి. పొటాషియం సమృద్ధిగా ఉండడంతో రక్తపోటు అదుపులో ఉంచుతుంది. గుండె సంబంధిత వ్యాధులను ధరిచేరనివ్వదు. శరీరంలోని హానికర వ్యర్థ పదార్థాలను తొలగించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. ముంజలను క్రమం తప్పకుండా తినడం వలన కొలస్ట్రాల్ తగ్గుతుంది. ముంజల్లో ఉండే పోషకాలు జీర్ణ సంబంధిత సమస్యను తగ్గిస్తాయి. తిన్న ఆహారం సక్రమంగా జీర్ణమవుతుంది. గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బడం, ఉదర సంబంధిత సమస్యలను తగ్గిస్తుంది. వేసవి తాపానికి వచ్చే వికారం, వాంతులను నివారిస్తుంది. మహిళల్లో రొమ్ము కేన్సర్ వచ్చే అవకాశాలను తగ్గిస్తుంది. చికున్ ఫాక్స్‌ను నివారిస్తుంది. ముంజలను గుజ్జుగా చేసి, ముఖానికి పై పూతగా రాసుకుంటే చర్మం ప్రకాశవంతంగా తయారవుతుంది. చర్మానికి కావాల్సినంత తేమను అందించి, వేసవిలో వచ్చే చెమటకాయల్ని నివారిస్తుంది.



మండుటెండలో తాటి ముంజలు విక్రయిస్తున్న మహిళ



కల్తీలేని ఫలం

కల్తీలేని ఫలాలు తాటి ముంజలు. వీటిని ప్రతి ఒక్కరూ ఇష్టంగా తింటారు. వేసవిలో నిత్యం రంగారెడ్డి జిల్లా మాల్ నుంచి తాటికాయలు తెచ్చి విక్రయిస్తాం. రోజుకు రూ.1500ల నుంచి రూ.2 వేల వరకు ఆదాయం లభిస్తుంది. ఏప్రిల్ మాసంలో కష్ట పడితే రూ.లక్ష వరకు మిగులుతుంది.

– రమేష్, వ్యాపారి, మాల్

ఆరోగ్యానికి మేలు



తాటి ముంజలను పొట్టుతో తీసుకుంటే మలబద్దకం తగ్గుతుంది. జీర్ణ కోశ సమస్యలకు దివ్య ఔషదంగా పనిచేస్తాయి. ఎక్కువగా పొటాషియం లభిస్తుంది. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ తినవచ్చు. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

– డాక్టర్ చిలువేరు శ్రీనివాసులు

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అనధికారిక లే అవుట్లలో ఖాళీ ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ (లే అవుట్ రెగ్యులరేషన్ స్కీం)ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి దరఖాస్తుదారులకు సూచించారు. ఈ మేరకు గురువారం ఎల్1, ఎల్2, ఎల్3 దరఖాస్తులపై సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. లే అవుట్ల క్రమబద్ధీకరణ, ప్లాట్ల రెగ్యులరైజేషన్ ఫీజులో 25 శాతం రాయితీ కల్పించిందన్నారు. ఈ నెలాఖరుతో గడువు ముగియనుందని, అర్హులైన వారంతా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిర్దేశిత రుసుం చెల్లించిన వారికి వెంటనే అనుమతుల పత్రం జారీ చేస్తున్నట్లు తెలిపారు. ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో కూడా ఎల్‌ఆర్‌ఎస్ రుసుం చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దుండిగల్: బైక్‌ను వెనుక నుంచి ఇన్నోవా కారు ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన మేరకు.. చర్చి గాగిల్లాపూర్ ప్రాంతానికి చెందిన ప్రశాంత్ ప్రియదర్శి(35) సూరారంలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే తన ద్విచక్రవాహనంపై గురువారం ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి గండిమైసమ్మ చౌరస్తా వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో చర్చి గాగిల్లాపూర్ కమాన్ వద్ద వెనుక నుంచి కారు బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ప్రియదర్శి తలకు తీవ్ర గాయాలు కావడంతో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భవిష్యత్తుకు టెక్నాలజీ కీలకం

ఇబ్రహీంపట్నం రూరల్: భవిష్యత్తును రూపొందించడానికి టెక్నాలజీ ఎంతో కీలకమని ఈసీఐఎల్ టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ అనిష్‌కుమార్ శర్మ పేర్కొన్నారు. మంగళ్‌పల్లి సమీపంలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఎలక్ట్రానిక్స్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ×రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఎంబిడెడ్ కంప్యూటింగ్, కంట్రోల్ ఆటోమేషన్‌¥ అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అనిష్‌కుమార్ శర్మ మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక అంశాల్లో అధిక నాణ్యత గల పరిశోధన.. ఎంబిడెడ్ సిస్టం, డిజైన్, రోబోటిక్స్, ఆటోమేషన్, సెన్సార్ నెట్వర్క్, రియల్ టైం సిస్టమ్ అవసరమన్నారు. కార్యక్రమంలో గౌరవ అతిథి డాక్టర్ భోజన్న పాసిక్, కీనోట్ స్పీకర్ సుమన్‌సనం, కళాశాల చైర్మన్ డాక్టర్ రాఘవ, డైరెక్టర్ రామశాస్త్రి, ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, డీన్ లాల్‌కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఈసీఐఎల్ టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ అనిష్‌కుమార్ శర్మ

మహేశ్వరం ఆర్టీసీ డిపోకు ‘హై లెవల్’ అవార్డు



ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డిపో మేనేజర్ లక్ష్మీసుధ

మహేశ్వరం: ఆర్టీసీ డిపోలో బస్సులకు అత్యధిక కేపీఎల్ వచ్చినందుకు మహేశ్వరం డిపోకు హైలెవల్ మైలేజ్ అవార్డు దక్కింది. హైదరాబాద్‌లోని అశోక్ లేలాండ్ వారు నిర్వహించిన సమావేశంలో హైదరాబాద్ సిటీ విభాగంలో ఆల్ బీఎస్–6 బస్సులకు అత్యధికంగా 5.77 కేపీఎల్ వచ్చినందుకు మహేశ్వరం డిపోకు హై మైలేజ్ అవార్డ్‌ను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా డిపో మేనేజర్ లక్ష్మీసుధ అందుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీసుధ మాట్లాడుతూ.. మహేశ్వరం డిపోలో డ్రైవర్లు, మెకానిక్‌లు, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది క్రమశిక్షణతో పని చేయడంతో ఈ అవార్డు దక్కిందన్నారు. అందరి కృషితో అవార్డు వచ్చిందని, ఈ అవార్డు మరింత బాధ్యత పెంచిందన్నారు.

అదృశ్యమై.. చెరువులో శవమై..



రాజు(ఫైల్)

మొయినాబాద్: భార్యతో గొడవ పడి అదృశ్యమైన వ్యక్తి చెరువులో శవమై తేలాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధి ఎనికేపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎనికేపల్లికి చెందిన మల్కాపురం రాజు(37) పెయింటర్‌గా పనిచేసేవాడు. ఈ నెల 21న రాత్రి మద్యం మత్తులో భార్య స్వప్నతో గొడవ పడ్డాడు. 22న తెల్లవారు జాము 4 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో తెలిసిన చోట్ల ఆరా తీశారు. అయినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో అతడి భార్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా.. గురువారం సాయంత్రం గ్రామ సమీపంలోని చెరువులో రాజు మృతదేహం తేలింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీశారు. వివరాలు సేకరించి పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

శంకరయ్యకు డాక్టరేట్



మహేశ్వరం: మహేశ్వరం మండల పరిధి కల్వకోల్ గ్రామానికి చెందిన పులిమామిడి శంకరయ్య ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్‌కు ఎంపికయ్యాడు. ఓయూలో తెలుగు ఓరియంటల్ విభాగంలో తెలుగు శాఖలో పీహెచ్‌డీ చేశారు. ఆ విభాగంలో డాక్టర్ చవ్వ వెంకట్‌రెడ్డి పర్యవేక్షణలో.. రంగారెడ్డి జిల్లా జానపద మౌఖిక కథలు, సమగ్ర పరిశీలన అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఆయనకు ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా శంకరయ్య మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబంలో జన్మించిన తనకు, ఈ డాక్టరేట్ రావడం సంతోషంగా ఉందన్నారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. శంకర్‌ను గ్రామస్తులు అభినందించారు. త్వరలో డాక్టరేట్ పట్టా, ప్రశంసా పత్రం అందుకోనున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆటో..

ఇద్దరు విద్యార్థులకు గాయాలు

మొయినాబాద్: అతివేగంతో ఎదురుగా వచ్చిన ఆటో, బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. ఈ సంఘటన హైదరాబాద్– బీజాపూర్ జాతీయ రహదారిపై మొయినాబాద్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. వికారాబాద్ జిల్లా ఆలంపల్లికి చెందిన మహ్మద్ ముబీన్, అతడి స్నేహితుడు షాబాద్ మండలం నాగర్‌గూడకు చెందిన మహ్మద్ ముదాసిర్.. మొయినాబాద్ మున్సిపల్ పరిధి గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. గురువారం మధ్యాహ్నం 2.30లకు ఓలా ఎలక్ట్రిక్ బైక్‌పై ఇద్దరు కలిసి కళాశాలకు వెళ్తుండగా, రాధాస్వామి సత్‌సంగ్ సమీపంలోకి రాగానే.. ఎదురుగా వచ్చిన ఆటో బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వెంటనే వారిని 108 అంబులెన్స్‌లో స్థానిక భాస్కర ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బాలికపై కుక్కల దాడి



గాయపడిన చిన్నారి

షాద్‌నగర్: ఇంటి ముందు ఆడుకుంటున్న బాలికపై గ్రామ సింహాలు దాడి చేశాయి. ఈ ఘటన పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో గురువారం చోటు చేసుకుంది. స్థానికంగా నివాసం ఉంటున్న నాగరాజు కూతురు అవని(8), ఇంటి ముందు ఆడుకుంటుండగా.. బాలికపై వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో చిన్నారికి గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. పట్టణంలో కుక్కల బెడద ఎక్కువ అయిందని, మున్సిపల్ అధికారులు స్పందించి శునకాలను తరలించాలని కోరుతున్నారు.

పెట్టుబడి పేరుతో టోకరా

సనత్‌నగర్: పెట్టుబడి పేరుతో వాట్సప్‌లో వచ్చిన సందేశానికి ఆకర్షితుడైన ఓ వ్యక్తి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1,07,000 టోకరా వేసిన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిదిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. సనత్‌నగర్‌లో నివాసం ఉండే నాగరాజు ఫోన్ వాట్సప్‌కు పెట్టుబడి పేరుతో సందేశం వచ్చింది. ఆ సందేశం నాగరాజును ఆకట్టుకుంది. ఎలా పెట్టుబడి పెట్టాలో వారిని అడగ్గా వారు మార్గనిర్దేశం చేశారు. దీనికి ఫిర్యాదుదారుడు నమ్మి రూ.1,07,000 భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టాడు. ఆ తర్వాత వారు చెప్పిన అన్ని పనులు పూర్తి చేశాడు. కానీ పెట్టుబడితో పాటు వారు ఇస్తానన్న కమిషన్ కూడా రాలేదు. దీంతో తాను ఇచ్చిన మొత్తాన్ని తిరిగి ఇవ్వాలంటూ నాగరాజు వారిని అడగ్గా ఎటువంటి స్పందన లేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించి సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను కిడ్నాప్ చేసి విక్రయానికి యత్నం



చిన్నారిని తల్లికి అప్పగిస్తున్న డీసీపీ పాటిల్ కాంతిలాల్

- చిన్నారిని రక్షించిన పోలీసులు
- ఐదుగురి రిమాండ్

చాంద్రాయణగుట్ట: ఐదేళ్ల బాలికను కిడ్నాప్ చేసిన ఓ ముఠాను చాంద్రాయణగుట్ట పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్, చాంద్రాయణగుట్ట డివిజన్ ఏసీపీ మనోజ్ కుమార్‌తో కలిసి గురువారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 20న బార్కాస్ ప్రాంతానికి చెందిన మరియం భాను(5) చాక్లెట్ ఇప్పించాలని మద్యం కొనుగోలు చేసేందుకు వెళ్తున్న పెద్దనాన్న బాబాసాదితో మారాం చేయడంతో తన వాహనంపై తీసుకెళ్లాడు. బాలికను వైన్స్ బయట ఉంచి మద్యం తీసుకొచ్చే సరికి బాలిక కనిపించలేదు. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా మలక్‌పేట్ సలీంనగర్ కాలనీకి చెందిన భార్యాభర్తలు సయ్యద్ జావిద్ పాషా(51), షహిస్తా పర్వీన్(40)ను అదుపులోకి తీసుకొని విచారించడంతో నేరం అంగీకరించారు. బాలికను కిడ్నాప్ చేసి ఉప్పల్ ప్రాంతానికి చెందిన పర్వీన్ భాను(40)కు రూ.1.30 లక్షలకు విక్రయించారు. పర్వీన్ భాను ఆ చిన్నారిని ఉప్పల్ చిలుకానగర్‌లో ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ నిర్వహించే సునీతా కుమారి(50), బంజారాహిల్స్‌లోని నోవా ఫర్టిలిటీ సెంటర్‌లో ఏజెంట్‌గా పనిచేసే కప్పల రాజేంద్ర ప్రసాద్(39) వద్ద అమ్మేందుకు బేరం పెట్టింది. సునీతా కుమారి, రాజేంద్రప్రసాద్ గతంలో ఈస్ట్ ముంబయ్‌లో ఇదే తరహా చిన్నారులను విక్రయిస్తూ పోలీసులకు చిక్కి జైలుకు వెళ్లి వచ్చారు. ఈ ఐదుగురు ముఠాగా ఏర్పడి ఇలాంటి నేరాలకు పాల్పడుతున్న పోలీసుల విచారణలో వెల్లడయ్యింది. నిందితుల వద్ద నుంచి యాక్టివా ద్విచక్ర వాహనం, ఆటో, రూ.76 వేల నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

రూ.74.56 లక్షల హవాలా డబ్బు స్వాధీనం



రాయదుర్గం పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

గచ్చిబౌలి: నెల రోజుల నుండి నిఘా ఉంచి రూ.74.56 లక్షల హవాల డబ్బును రాయదుర్గం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన మేరకు.. ఇద్దరు యువకులు యాక్టివాపై డబ్బులు తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం అందడంతో రాయదుర్గంలోని విస్పర్ వ్యాలీ జంక్షన్‌లో ఎస్ఐ శ్రీనివాస్ వాహనాల తనిఖీలు చేపట్టారు. బుధవారం రాత్రి 9 గంటల సమయంలో వాహనంపై ఒక బ్యాగ్ కనిపించింది. తనిఖీ చేయగా ఆ బ్యాగ్‌లో రూ. 74,56,200 నగదు లభించింది. కరీంనగర్‌కు చెందిన బి.సాయికృష్ణ బీటెక్ పూర్తి చేసి చిత్రపురి కాలనీలో నివాసం ఉంటున్నాడు. రాయదుర్గంలో ఉండేరవితో కలిసి బేగంపేట్‌లోని సురెందర్ అగర్వాల్ నుంచి డబ్బు తీసుకొని వస్తున్నారు. రవి డ్రైవింగ్ చేస్తుండగా బ్యాగ్‌తో సాయి కృష్ణ వెనకాల కూర్చున్నాడు. మియాపూర్‌కు వెళ్లి ఫోన్ చేస్తే ఎవరికి ఇచ్చేది చెప్తారని పోలీసులు తెలిపారు. లెక్క చూపించని నగదును ఆదాయపు పన్నుశాఖ అధికారులకు అప్పగించామన్నారు. కొంత కాలంగా బ్లాక్ మనీ అక్రమ రవాణా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం ఉంది. ఈ క్రమంలోనే రెండు మూడు సార్లు పట్టుకునేందుకు ప్రయత్నించినా పట్టుబడలేదు.విశ్వసనీయ సమాచారంతో ఎట్టకేలకు భారీ నగదును స్వాధీనం చేసుకున్నారు.